ఏటిలో కొట్టుకుపోయిన రైతు

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని గౌరీపట్నం గ్రామంలో గ్రామ పంచాయతీ రేవు దగ్గర కళ్లాలకు వెళ్లేటపుడు ఆకుల కిష్టమ్మ కుమారుడు నాగరాజు (61) మంగళవారం మధ్యాహ్నం 1:30కి ఏట్లో కొట్టుకు పోయినట్లు బంధువులు, స్థానికులు తెలియజేసారు. దీనిపై తహశీల్దారు పి.తిరుమల బాబు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. గజ ఈతగాళ్లు, ఫైరింజన్‌తో నాగరాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కూటమిలో కుంపటి

- నిరుపేదల ఇళ్లు కూల్చివేతపై ఉన్నతాధికారుల విచారణ

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం విఘ్నేశ్వరుని గుడి ఎదురుగా ప్రధాన రహదారిలో నివాసముంటున్న ఓ నిరుపేద కుటుంబం అన్నపురెడ్డి వరలక్ష్మి ఇల్లు కూల్చివేసిన సంఘటనలో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జిల్లా పంచాయతీ అధికారి (డి.పి.ఎల్.ఓ) ఎస్.ఎస్.ఎస్.ఎన్.మూర్తి మంగళవారం విచారణ చేపట్టారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు చోడవరం మేజర్ పంచాయతీ ఈ.ఓ. నారాయణరావుతో కలసి సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. 'డ్రైనేజీల ఏర్పాటు కోసం' అంటూ పంచాయతీ అధికారులు ఇచ్చిన సమాధానం మేరకు అధికారులు పడగొట్టిన బాధితుల ఇంటిని పరిశీలించారు. సంఘటన స్థలంకు సంబంధించిన దస్తావేజులు సమర్పించవలదిందిగా బాధితులను కోరారు. విచారణ అనంతరం ఉన్నతాధి కారులకు నివేదిస్తామని, తదుపరి ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని మీడియాకు తెలిపారు. నిరుపేద బి.జె.పి. కార్యకర్త అయిన బాధితురాలు వరలక్ష్మీ అనకాపల్లి ఎం.పి. సి.ఎం.రమేష్‌కు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారుల్లో స్పందన మొదలైందన్నారు. ఈ సంఘటనలో ప్రధాన పాత్రధారుడు, సూత్రధారుడు అయిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, టి.డి.పి. మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావులను రక్షించేందుకు చోడవరం కూటమి టీడీపీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శతవిధాలా ప్రయత్నించారని బి.జె.పి. మాజీ అధ్యక్షుడు బయిన కామేశ్వరరావు ఆరోపించారు. పట్టణ నడిబొడ్డులో ఓ నిరుపేద మహిళ కుటుంబానికి అన్యాయం జరిగి 10 రోజులైనను స్థానిక ఎమ్మెల్యే రాజు పట్టించుకోపోవడమే దీనికి నిదర్శనమన్నారు. సి.పి.ఐ. జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏ.పి. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, అనుబంధ ప్రజా మహిళా సంఘాల మద్దతుతో బాధితుల నిరసనలు మంగళవారంతో 10వ రోజుకు చేరుకున్నాయి. ముందస్తుగా ఎటువంటి నోటీసు, సమాచారం లేకుండా మాజీ ఉప సర్పంచ్ సాగర్, పంచాయతీ కార్యదర్శి నారాయణరావులు పేదలపై దౌర్జన్యంకు పాల్పడ్డారని, ఉన్నతాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల తరఫున డిమాండ్ చేశారు. అధికారుల అనైతిక చర్యలు వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ శక్తులు కొమ్ము కాస్తున్నారని స్థానికుల ఆగ్రహం చెందారు. ఈ విచారణలో డి.ఎల్.పి.ఓ. మూర్తి వెంట ఈఓఆర్డీ చైతన్య వున్నారు. బాధితుల వెంట బీజేపీ నాయకులు బయినా కామేశ్వరరావు, మండల అధ్యక్షుడు బుద్ధ అమర్ తదితరులున్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ర్యాలీ

విశాలాంధ్ర - కశింకోట: కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ర్యాలీ, అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.తిరుపతిరావు మాట్లాడుతూ నేత్ర దానం గురించి ప్రతి హెచ్‌డబ్ల్యూసి నందు ఏఎన్ఎం, ఆశ ఫీల్డ్‌లో తిరిగినప్పుడు ప్రజలకు నేత్రదాన ఆవశ్యకతను వివరించాలని ఆదేశించారు. మనిషి తాను మరణించిన తర్వాత తన నేత్రాలను దానం చేయడం ద్వారా మరొకరికి చూపు ప్రసాదించిన వాడు అవుతాడు కాబట్టి అన్ని దానాలు కంటే నేత్రదానం చాలా గొప్పదని డాక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాలిక్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్వైజర్ రామ్మూర్తి, సత్యవతి, విజయలక్ష్మి, ఫార్మసీ ఫణి, పారామెడికల్, సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి కిరాణా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర - చోడవరం: చోడవరంలో వాసవి క్లబ్ వారోత్సవాలులో భాగంగా మూడోవ రోజు మంగళవారం శ్రీ లలితా దేవి వృద్ధ ఆశ్రమంకి యూత్ క్లబ్ తరఫున కిరాణా సామాన్లు, కూరగాయలు పళ్ళు సుమారు 3600/-విలువ గల సామాన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ ప్రెసిడెంట్ పూసర్ల కిరణ్, సెక్రటరీ పెన్నం రాజు, ట్రెజరర్ కొల్లూరు సంతోష్, ఆర్.సి. సత్యవరపు శ్రీనివాసరావు, జెడ్.సి. పూసర్ల రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మణికొండ చక్రవర్తి, వి కే ఎస్ పి ఇన్చార్జ్ ఉదయగిరి చందు పాల్గొన్నారు. అనంతపల్లి శ్రీనివాస్ టీం సభ్యుల సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

నేడు ఏఎల్ పురంలో మెగా క్యాన్సర్, రక్తదాన శిబిరాలు

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో బుధవారం ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నేత, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ తెలిపారు. విశాఖపట్నం మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేయనున్న క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎల్ పురంతోపాటు సమీప గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా నర్సీ పట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో మండలంతో పాటు సమీప గ్రామాల ప్రజలందరూ కూడా స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: మండలంలో ఉన్న భోజన టిఫిన్ సెంటర్లన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారుల బృందం హోటల్ యజమానులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, డిప్యూటీ తహశీల్దార్ రమేష్ బాబు, ఐసీడీఎస్ సీడీపీఓ మంగతాయారు ఉమ్మడిగా హోటల్స్‌ను, అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. వంటలు చేసే ప్రదేశాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ పదార్థాలను హోటల్స్‌లో ఉంచవద్దని అన్నారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తామని ఎక్కడైనా నిల్వ పదార్థాలు ఉన్నట్లయితే ఆ హోటల్‌పై కేసులు నమోదు చేస్తామన్నారు. వండిన మాంసాహారాన్ని ఫ్రిజ్‌లో ఉంచినా కేసులు ఉంటాయని హెచ్చరించారు. అలాగే కే.కోటపాడులో ఉన్న మూడు అంగన్వాడీ సెంటర్లలో ఉన్న కిచెన్ రూములు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులను ప్రతిరోజు శుభ్రతగా చూసుకోవాలని వేడి పదార్థాలను మాత్రమే చిన్నారులకు అందించాలన్నారు. పిల్లలకు ఏమైనా జ్వరాలు వచ్చినట్లయితే వెంటనే ఆసుపత్రి సిబ్బందికి తెలియపరచాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు కూడా హోటల్స్ నిర్వహణపై ఫిర్యాదులు చేయవచ్చునని తెలిపారు.

ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఎస్సైగా దామోదర్ నాయుడు పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాకవరపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు అల్లు రాము నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటరమణ, జి.కోడూరు టీడీపీ ప్రెసిడెంట్ జయ బాబు, సీనియర్ నాయకులు జోగుపాత్రుడు, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము, పైడిపాల టీడీపీ నాయకులు సిద్ధ బత్తుల శ్రీను, టీడీపీ మాజీ మండల తెలుగు మహిళ రమణమ్మ, తూటిపాల టీడీపీ నాయకులు రమణబాబు, నారాయణ రాజుపేట మాజీ సర్పంచ్ వెంకటగిరి, గంగవరం సర్పంచ్ రమణ, శెట్టిపాలెం టీడీపీ నాయకులు ఈశ్వరరావు, రాచపల్లి టిడిపి నాయకులు జమీందారు, ఎంకియ పాలెం టిడిపి నాయకులు శ్రీనులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలపై పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - పరవాడ: వైద్యురాలు మౌమితపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనను ఖండిస్తూ మంగళవారం పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాలు నిరసన చేపట్టారు. ఆశాలు ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేసారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టాలన్నారు. ప్రభుత్వం ఎన్ని కొత్త చట్టాలు తెచ్చినా మహిళలపై దాడులు ఆగకపోవడం దారుణమన్నారు. కఠిన శిక్షలతోనే ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయవచ్చన్నారు. తక్షణమే దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు వెన్నెల లక్ష్మి, మణి, నన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చేపల చెరువు పెంపకందారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలో కొత్తపెంట, ములకాలపల్లి పెదనందిపల్లి కలిగొట్ల, తారువా, మారేపల్లి గ్రామాల్లో ఉన్న చేపల చెరువులను సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న మంగళవారం అక్రమ చేపలు చెరువులను పరిశీలించారు. వెంకన్న మాట్లాడుతూ దేవరాపల్లి మండలంలోని ఎటువంటి అనుమతులు లేకుండా దాదాపు పదిహేను వందల ఎకారాల్లో చేపలు చెరువులు వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతుందని తెలిపారు. ఈ చెరువులన్నీ ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారస్తులు దేవరాపల్లి మండలంలోని రైవాడ నీళ్ళు అనువుగా ఉండడంతో రైతులకు డబ్బులు ఆశ చూపించి భూములు లీజులకు తీసుకుని చెరువులు తవ్వకాలు చేపాట్టారని తెలిపారు. ఈ చేపలు పెంపకం కోసం మేతగా చనిపోయిన పశుమాంసం చికెన్ సెంటర్‌లో వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తున్నారని, దీని వలన చేపలు తినే వారికి తీవ్రమైన రోగాలు వస్తున్నాయని అన్నారు.

గతంలో రెవెన్యూ, పోలీసు, ఫిషరీస్ విజిలెన్స్ అధికారులు పట్టుకొని కేసులు పెట్టే వారని ప్రస్తుతం వారు కూడా పట్టించుకోవడం లేదన్నారు.

దీనిపై గతంలో జిల్లా కలెక్టర్ వారికి ఫిర్యాదు చేయడంతో ఫిషరీస్ అధికారులు చేపలు పెంపకందారులకు నోటీసులు ఇచ్చి మామ్మూళ్లు తీసుకొని చేతులు దులుపేసుకున్నారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేపల చెరువులపై వున్న గ్రైడింగ్ మిషన్‌లను తొలగించి, అనుమతులు లేని చేపల చెరువులు పెంపకందారులపై క్రిమినల్ కేసులు పెడితే తప్ప మార్పు రాదన్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు
టిడ్కో గృహస్తులకు తప్పని ఇబ్బందులు

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీ రాంనగర్ నుండి టిడ్కో గృహాలకు వెళ్లే రోడ్డు అడుగడుగునా గోతులమయంగా మారి టిడ్కో గృహస్తులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ రోడ్డు గుండా యలమంచిలి వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చిన్నపాటి వర్షం కురిసిన రోడ్ అంతా గోతులమయంగా మారి అస్తవ్యస్తంగా తయారవుతుంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే తీవ్ర అవస్థలకు గురవుతున్నామని స్థానిక టిడ్కో గృహస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే రోడ్డంతా బురదమయం అవడంతో వాహనదారులు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు అధ్వాన్నంగా మారడంతో వాహన చోదకులు, పాదచార్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటంపై టిడ్కో గృహస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డుని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించిన డీపీఓ

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీష రాణి, డి.వి.ఆర్.సి. కోఆర్డినేటర్ ఇ.నాగలక్ష్మి పరిశీలించారు. ఇందులో భాగంగా పి.ఎల్.పురం గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడుదల చేశారు. అలాగే నామవరం, సత్యవరం, పెదరామభద్రపురం గ్రామాలలో పర్యటిం చిన డీపీఓ ఆర్.శిరీష రాణి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు అందజేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వై.సత్యనారాయణ, మల్లికార్జున చారి, శ్రీధర్, రామ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర - నక్కపల్లి: వినాయక చవితి పండగ సందర్భంగా వినాయక మంటపం ఏర్పాటు చేయు ప్రజల కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకుని వచ్చిందని తప్పనిసరిగా నిబంధనలు పాటించి అనుమతులు తీసుకోవాలని నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.కుమార్ స్వామి మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు వినాయక మంటపం ఏర్పాటు కోసం ప్రజలు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర ఎన్ఓసి పత్రం తీసుకోవలసి ఉండేదని, దీనికోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగవలసి వచ్చేదన్నారు. ప్రజల వెసులుబాటు కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకొచ్చిందని దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఇందులో భాగంగా ప్రజలు 799 5095800 మొబైల్ నంబర్‌కు వాట్సప్ ద్వారా హాయ్ అని సందేశం పంపిస్తే చాలు, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించవలసిన ప్రక్రియ మొత్తం వాట్సప్ ద్వారా ప్రజల యొక్క మొబైల్ ఫోన్‌కు వస్తుందన్నారు. నిర్వాహకులు గణేష్ ఉత్సవ్. ఏపీ పోలీస్. గవర్నమెంట్. ఇన్ అనే వెబ్సైట్ నందు గణేష్ మంటపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు చేయు ప్రదేశం, నక్కపల్లి స్టేషన్ పరిధిలో విగ్రహం ఎత్తు, మంటపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు పంపించాలని సూచించారు. అనంతరం వచ్చే వివరాలతో పూర్తిస్థాయి వివరాలు పరిశీలించి అను మతులు మంజూరు చేయబడతాయని దీన్ని ఉపయోగించు కోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సమాచారం అందజేయడం జరుగు తుందని పోలీసులకు సహకరించాలని కుమార్ స్వామి కోరారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన తెలుగు పండిట్ కోటేశ్వరరావుకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిట్ల చలపతి, ఎయిమ్ సభ్యులు సరమండ వీరబాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన రుత్తల రామకృష్ణ పదవి విరమణ చేయడంతో కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ చిట్ల చలపతి మాట్లాడుతూ పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు కృషి చేయాలని ప్రిన్సిపాల్‌ను ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరే విధంగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్య కమిటీ చైర్మన్ ఎం.శివ, గొలుగొండ ఎయిమ్ అధ్యక్షులు చిట్ల అప్పారావు, చిరంజీవి బుంగా రామకృష్ణ, జువ్వల వరహాలు బాబు, కుపరాల నర్సింగ్‌రావు, తారాబత్తిన మాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ కేవీ రమణ ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

నేత్ర దానం చేయండి
కంటి వైద్యులు బి.వెంకటరావు

విశాలాంధ్ర - యస్.రాయవరం: నేత్ర దానం చేయడం వలన కంటి చూపు లేని వారికి ఎంతో ప్రయోజనకరం అని కంటి వైద్యులు బి.వెంకటరావు అన్నారు. మంగళవారం మండలంలో సర్వసిద్ధి, పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్రదానం చేయడం వలన మరణించిన తరువాత ఆ నేత్రాలు తీసి మరో వ్యక్తికి పెట్టడం వలన ఎంతో ఉపయోగం అన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శక్తి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావమే ప్రజాప్రతినిధుల లక్ష్యం కావాలి

విశాలాంధ్ర - మధురవాడ: ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోను ఉండదని సేవా భావమే చట్ట సభలకు ఎన్నికయ్యే ప్రజాప్రతినిధుల లక్ష్యంగా ఉండాలని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) అనుబంధ యువజన విభాగం యంగ్ ఇండియన్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశ ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే యువత చట్ట సభల ముఖ్యంగా పార్లమెంట్ పనిచేసే విధి, విధానాలు, సభ్యులుగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యతలు అవగాహన చేసుకోవాలని సూచించారు. చట్ట సభలకు ప్రతినిధులను ఎన్నుకునే సమయంలో సహితం జాగరూకతతో వ్యవహరించాలన్నారు. దేశం అర్ధవంతమైన అభివృద్ధి వైపు ప్రయాణించాలంటే సరైన ఆలోచన విధానం గల ప్రజలు వారు ఎన్నుకునే ప్రజాప్రతినిధుల ద్వారా మాత్రమే సాధ్యపడుతోందన్నారు. యువత నిరంతర విద్యార్థిగా కొత్త అంశాలను నేర్చుకునేవారిగా ఉండాలని, మంచి సహచరులు ఉంటే ఆలోచనలు సరైన మార్గంలో ఉంటాయన్నారు. రోల్‌మోడల్‌గా ఉండాలనుకునే వారిపై బాధ్యతలు ఎక్కువగా ఉంటాయన్నారు. తన వరకు రాజకీయ నేపద్యం గల కుటుంబం నుంచి రావడం పార్లమెంట్‌లో అడుగు పెట్టడానికి కారణమైందని శ్రీభరత్ పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరి నుంచి ఎంతోకొంత నేర్చుకోవచ్చునని తాను విశ్వసిస్తానని, కొత్తవారిని కలవడం ఆలోచనలను పంచుకోవడం తనకు నిత్యం ప్రేరణగా ఉపయోగపడు తోందన్నారు. కార్యక్రమంలో యంగ్ ఇండియన్స్ జాతీయ అధ్యక్షుడు దర్శన్ ముతా యువతకు నాయకత్వ లక్షణాలు, పరిపాలన అంశాలపై అవగాహన కల్పించారు. విశాఖ శాఖ అధ్యక్షుడు హర్షనందన్, డాక్టర్ బి.శ్రావిణి, సదఫ్ మెహిది తదితరులు యువతకు దిశానిర్దేశం చేశారు. దేశ ప్రగతిలో యువ నాయకత్వం అవసరాన్ని, యువత బాధ్యతలను, ఆలోచన విధానాలను ఏ విధంగా మార్పు చేసుకోవాలో వారు వివరించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి యువతి యువకులు హాజరయ్యారు. యువత అడిగిన పలు ప్రశ్నలకు శ్రీభరత్ సమాధానమిచ్చారు.

ప్రజాసేవే కాదు.. మీ ఆరోగ్యం జాగ్రత్త సారు..!

– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విజ్ఞప్తి

– 5న తెలుగు శక్తి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: తెలుగు ప్రజల శ్రేయస్సును ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల శ్రేయస్సు ను దృష్టిలో ఉంచుకొని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ కోరారు. విజయవాడ చరిత్రలో కనివిని రీతిలో సంభవించిన ఘోర విపత్తు కారణంగా లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు కావడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎంతగానో కలచి వేసిందన్నారు. ఈ పరిస్థితులలో పగలు రాత్రి తేడా లేకుండా నిద్రాహారాలు మానుకొని చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నా రన్నారు. తన ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టి చంద్రబాబు నాయుడు ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. అయినప్పటికీ ఆరోగ్యం పట్ల తగ్గిన శ్రద్ధ చూపాలని చంద్రబాబు నాయుడుకు బి.వి.రామ్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక శ్రామికుడిలా శ్రమిస్తూ ఉంటే పులివెందుల ఎమ్మెల్యే వైయస్ జగన్మోహన్ రెడ్డి కి కళ్ళు కనిపించడం లేదన్నారు. ప్రజలు

ఛీ కొట్టినా ప్రతిపక్ష హెూదా కూడా ఇవ్వకపోయినా.. అదేపనిగా చంద్రబాబు నాయుడు పైన, కూటమి ప్రభుత్వం పైన బురద జల్లే ప్రయత్నం చేయడం తగదన్నారు. ప్రజలు బాధపడుతుంటే వారికి తగిన రీతిలో సహాయం చేయాల్సింది పోయి.. శవాలపై చిల్లర ఏరుకునే రీతిలో వైయస్ జగన్ దిగజారిపోయి మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా జగన్ తన పద్ధతిని మార్చుకుని చేతనైతే వైసీపీ శ్రేణులను సహాయ పునరావాస కార్యక్రమాలలో పాల్గొనే విధంగా దిశానిర్దేశం చేయాలన్నారు.

ప్రొఫెసర్ శాంతమ్మకు పద్మశ్రీ లేదా పద్మభూషణ్ ప్రదానం చేయాలి

ఈ నెల 5వ తేదీన.. ఉపాధ్యాయుడు భారత మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (గురు పూజోత్సవం) ని పురస్కరించుకుని తెలుగు శక్తి ఆధ్వర్యంలో ముగ్గురు గురువులకు ఘనంగా సత్కరించబోతున్నారు. ఈ నేపథ్యంలోనే గురుపూజో త్సవం పోస్టర్ ను భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చేతుల మీదుగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఆవిష్కరింపజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 95 సంవత్సరాల వయసులోనూ విద్యా బోధన చేస్తున్న ప్రొఫెసర్ శాంతమ్మకు కేంద్రం ప్రభుత్వం పద్మశ్రీ లేదా పద్మభూషణ్ ప్రదానం చేయాలని రామ్ విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఈనెల 5వ తేదీన బీచ్ రోడ్ లోని హెూటల్ అంబికా సీ గ్రీన్ లో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను తెలుగు శక్తి ఘనంగా సత్కరిస్తుందని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ వప్పూర్ నికుంజ్, డాక్టర్ కే సురేష్, తెలుగు శక్తి యువత అభివృద్ధి సలహాదారు వి.వంశీ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి

విశాలాంధ్ర – ఆనందపురం: ఆంధ్రప్రదేశ్‌లో లక్ష 75 వేల మంది వర్కర్లు గత 22 సంవత్సరాలుగా వైన్ షాపుల్లో విధులు నిర్వహించి వారి జీవనోపాధి సాగించే వారని కమిటీ అధ్యక్షులు తెలిపారు. మంగళవారం స్థానిక వెల్లంకిలో ఏర్పాటుచేసిన విశాఖ జిల్లా మద్యం దుకాణాలు నిరుద్యోగ కార్మికుల సభలో మాట్లాడుతూ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మా కార్మికులును రోడ్డున పడేశారని 22 సంవత్సరాలుగా పని చేసే వారిని పక్కన పెట్టి నచ్చిన వారిని ప్రభుత్వం పేరు చెప్పి మద్యం షాపుల్లో తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, వైయస్సార్సీపి ప్రభుత్వం లో మద్యం దుకాణంలో పనిచేసిన వర్కర్లు బెల్ట్ షాపులకు విక్రయాలు జరిపే వారని, ఒక్కో బాటిల్ దగ్గర 50 నుంచి 200 వరకు అధిక చార్జీలు వస్తువులు చేసి 3 వేల నుంచి 5000 వరకు రోజువారి జోబులో వేసుకునే వారిని తెలిపారు. అయితే 1997 నుండి 2019 వరకు పనిచేసిన వర్కర్స్ అనుభవంతో కూడిన వారని, వారి కుటుంబ సమస్యల ఆర్థిక విషయాల్లో వర్కర్స్ యూనియన్ వారికి అండగా ఎప్పుడూ ఉంటుందని సభ్యులు ఎవరు అధైర్య పడవద్దని అవసరమైతే జిల్లా స్థాయి నుండి రాష్ట్ర ప్రభుత్వం వరకు ప్రభుత్వానికి సమస్యలు తెలిసేలా పోరాటం చేస్తామని, కార్మికులకు ఉద్యోగ భద్రతి కల్పించే దిశగా పోరాటం చేయాలని, పాత షాపుల్లో పనిచేసే వారందరికీ

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నాయకులు ప్రస్తుత విధానంలో వైన్ షాపుల్లో ఉపాధి కల్పించి పాత వాళ్లకి అవకాశం కల్పించాలని లిక్కర్ యూనియన్ అసోసియేషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మద్యం దుకాణాల నిరుద్యోగ కార్మిక సభ్యుల కమిటీ అధ్యక్షులు (పాలకొల్లు కమల్) కె.సుధాకర్ (రాష్ట్ర ప్రధాన అధ్యక్షులు) ఎం.డి.ఇస్మాయిల్ ఖాన్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) కె.చంద్రరావు (రాష్ట్ర ఉపాధ్యక్షులు) కె.శ్రీనివాస్ (రాష్ట్ర ఉప కార్యదర్శి) రాష్ట్ర కమిటీ సభ్యులు: తాతాజీ, భరత్, భవానిశంకర్, జగన్, అంబేద్కర్, భాస్కర్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి భూమిని కాపాడండి

విశాలాంధ్ర – పద్మనాభం: పద్మనాభం మండలం స్థానిక తాసిల్దార్ ఆనంద్ కుమార్‌కు అయినాడ గ్రామస్తులు, గ్రామ పెద్దలు, నాయకులు అందరూ కలిసి మంగళవారం అమ్మవారి భూములు అన్యాక్రాంతం అవ్వటంపై ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అయినాడ గ్రామంలోని శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి సర్వే నెంబరు

5-2 లో సుమారు 7 ఎకరాల 32 సెంట్లు జిరాయితీ భూమి కలదు. గ్రామస్తులు అందరూ కలిపి ఈ భూమిని అమ్మవారి ధూప దీప నైవేద్యాలు కొరకు అమ్మవారి పండగలో జాతరల నిర్వహణ కొరకు ఆనవాయితీగా వినియోగించడం జరుగుతూ వస్తుంది. ఈ భూమికి సంబంధించి సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ ,అడంగల్ పహాని తదితర ధృవపత్రాలు అమ్మవారి పేరు మీదనే ఉన్నాయి.కాగా గత కొంతకాలంగా కొంతమంది భూకబ్జాదారులు దీనిపై కన్ను కనపడింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం దువ్వ

వెంకటప్పుడు ఓరఫ్ రమణ, తనకి ఉన్న రాజకీయ పలుకుబడిని, అండదండలు తో ఈ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించాడు. గతంలో కొంత భూమిని దుర్గా సతీష్ కుమార్ అనే వ్యక్తికి అమ్మివేసి ,మరలా ఇప్పుడు రేకుల షెడ్లు వేసి అమ్మకానికి పెట్టి ఉన్నారు. మా గ్రామానికి సంబంధించి ఎక్కడ ప్రభుత్వ భూమి లేకపోవడం వలన అమ్మవారి భూమిలో గ్రామానికి సంబంధించి ప్రభుత్వ భవన నిర్మాణాలు గ్రామస్తుల ఆమోదంతో చేపట్టడం జరిగింది. ఈ విషయమై దుర్గా సతీష్ కుమార్ హైకోర్టుకు వెళ్లగా వారు కేసు కొట్టి వేయడం జరిగింది. ప్రస్తుతం ఈ భూమి తమ సొంత భూముగా భావిస్తూ ఇందులో వారికి ఇష్టం వచ్చినట్టు నిర్మాణాలు చేపడుతున్నారు. కావున తాసిల్దారు వారు దీనిపై విచారణ జరిపించి శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి భూములను కాపాడవలసిందిగా, అక్రమ నిర్మాణాలను వెంటనే తీయించి వేయాలని గ్రామస్తులు ఈ విన్నపములో తెలియజేశారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల ముగింపు దృశ్యమాలిక

విశాఖలో మంగళవారం సాయంత్రం ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు ముగింపు సందర్భంగా నగరంలో నిర్వహించిన ప్రదర్శన, బహిరంగ సభలో వివిధ దృశ్యాలు.